కూటమిదే ఆధిక్యం



ఓట్ల కట్టలను పరిశీలిస్తున్న ఆర్వో వెట్రిసెల్వి

ఉమ్మడి ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు తొలి రౌండ్‌లో తెలుగుదేశం కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం అధిక్యంలో నిలిచారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయానికి తొలి రౌండ్ ఓట్ల లెక్కింపు ముగిసింది. మొత్తం 28 టేబుల్స్ ఏర్పాటు చేశారు. టేబుల్‌కు వెయ్యి ఓట్లు చొప్పున రౌండ్‌కు 28 వేల ఓట్లు లెక్కిస్తున్నారు. తొలి రౌండ్‌లో రాజశేఖరానికి 16,520 ఓట్లు రాగా పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు 5,815 ఓట్లు దక్కాయి. ఇతరులకు 3,249, చెల్లని ఓట్లు 2,416 వచ్చాయి. దీంతో టీడీపీ అభ్యర్థికి తొలిరౌండ్‌లోనే 10,705 ఓట్ల ఆధిక్యం లభించింది. రెండో రౌండ్ పూర్తయ్యే సరికి మరింత సమయం పడుతుంది. మంగళవారం ఉదయం పది గంటలకు తొలి ప్రాధాన్యత ఓట్లతో ఎవరు గెలుస్తారు ? లేదా.. రెండో ప్రాధాన్యత ఓట్ల పరిగణనలోకి వస్తారా?.. అన్నది తేలబోతుంది. తమ పార్టీ అభ్యర్థి రాజశేఖరానికి చివరి రౌండ్ వరకు ఇదే అధికృత దక్కుతుందని టీడీపీ వర్గాలు ధీమాతో ఉన్నాయి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఈ ఎన్నికల పోలింగ్ గత 27న జరిగింది. మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. రెండు లక్షల 18 వేల 902 ఓట్లు పోలయ్యాయి. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కౌంటింగ్‌కు గాను 28 టేబుల్స్ వినియోగించి ఎనిమిది రౌండ్లలో పూర్తి చేయాలని నిర్ణయించారు. ఓట్ల లెక్కింపునకు వీలుగా ఉదయం ఎనిమిది గంటల నుంచే సిబ్బంది అప్రమత్తమయ్యారు. తొలుత స్ట్రాంగ్ రూముల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రానికి చేర్చారు. రౌండ్ల వారీగా బ్యాలెట్ బాక్సుల్లోని పత్రాలను బయటకు తీసి తొలుత కట్టలుగా కట్టారు. ఈ ప్రక్రియ యావత్తు కొనసాగేందుకు వీలుగా 28 టేబుళ్లలో కొనసాగించేందుకు వీలుగా మూడు షిఫ్టులలో 700 మంది సిబ్బంది, అధికారులను రంగంలోకి దించారు.

సాధారణంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు అంత సులువుగా సాగదు. ఈసారి అదే పరిస్థితి ఆవిష్కృతమైంది. ఉదయం నుంచే సిబ్బందిని కౌంటింగ్ కేంద్రాల్లో మోహరించి వారికి బ్యాలెట్ బాక్సులు తెరవడం, వాటిలో ఉన్న బ్యాలెట్ పత్రాలను బండిల్స్‌గా కట్టడం వంటి ప్రక్రియను అప్పగించారు. తొలి మూడు గంటల్లో పోస్టల్ బ్యాలెట్లను పరిశీలించారు. మొత్తం పోస్టల్ బ్యాలెట్లు 242 కాగా వీటిలో 201 బ్యాలెట్ పత్రాలు చెల్లుబాటు కాగా మరో 41 చెల్లకుండాపోయాయి. ఉదయం 11 గంటల నాటికే పోస్టల్ బ్యాలెట్‌ల తతంగాన్ని ముగించారు. సమాంతరంగా రౌండ్‌ల వారీగా బ్యాలెట్ పత్రాలు బండిళ్లుగా కట్టలు కట్టే పనిని కొనసాగిస్తూ వచ్చారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, మిగతా అధికారులు కౌంటింగ్ ప్రక్రియ ఆరంభం నుంచి క్షణక్షణం పరిశీలించడంలో నిమగ్నమయ్యారు. కౌంటింగ్ కేంద్రంలో గుర్తింపు కార్డులున్న వారినే అనుమతించారు. మీడియాను నిర్దేశించిన ప్రాంతంలోనే ఉంచారు. కౌంటింగ్ కేంద్రంలోకి మధ్యాహ్నం నుంచి కొందరిని అనుమతించారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులతో రాజశేఖరం



కౌంటింగ్ కేంద్రంలో ఆర్వో వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

తొలి రౌండ్ ఫలితం వెల్లడి

- పేరాబత్తులకు 16,520.. ఆధిక్యం 10,705
- దిడ్ల వీరరాఘవులుకు 5,815 ఓట్లు
- సుదీర్ఘంగా సాగుతున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- ఓట్లను కట్టలుగా కట్టేందుకు 12 గంటలు
- రాత్రి 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఆరంభం.. అర్ధరాత్రి 12 గంటలకు తొలి ఫలితం
- నేటి మధ్యాహ్నానికి విజేతపై స్పష్టత

బండిల్స్‌గా కట్టేందుకే అధిక సమయం..

రౌండ్‌ల వారీగా పది వేలకు తగ్గకుండా ఈ బండిళ్లను ఏర్పాటు చేస్తూ వచ్చారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల్లోపు సుమారు పది వేల ఓట్లతో మొదటి రౌండ్ బండిళ్లుగా కట్టగలిగారు. అప్పటి నుంచి 11వ రౌండ్ వచ్చే సరికి బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కట్టేందుకు ఏడు గంటల సమయం తీసుకుంది. వాస్తవానికి కౌంటింగ్ కేంద్రంలో రౌండ్‌ల సంఖ్య, టేబుల్స్ సంఖ్య కాస్త పెంచి ఉంటే ఇంత సుదీర్ఘ సమయం పట్టేది కాదు. ఒకవైపు బ్యాలెట్ పత్రాలను బండిళ్లుగా చేసేందుకు సమయం పడుతుండడంతో అభ్యర్థులతోపాటు ఎన్నికల ఫలితాలపై ఎదురుచూస్తున్న వారంతా ఉత్కంఠకు గురయ్యారు.



కౌంటింగ్ కేంద్రంలో అభ్యర్థులు ఆలపాటి, లక్ష్మణరావు

గెలుపు దిశగా..!

- ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాలు.. ఐదు రౌండ్లకే ఆలపాటికి 47,872 ఓట్ల ఆధిక్యం

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ విజయం దిశగా దూసుకుపోతున్నారు. మొదటి రౌండ్ లెక్కింపుతోనే మెజారిటీని దక్కించుకున్న ఆయన రౌండ్ రౌండ్‌కు తిరుగులేని ఆధిక్యాన్ని కనబరుస్తున్నారు. గట్టి పోటీని ఇస్తారని అందరూ ఊహించిన పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు దారుణమైన ఓటమి చవిచూసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అర్ధరాత్రి 12:30 గంటలకు ఐదు రౌండ్ పూర్తయ్యేసరికి ఆలపాటికి 84,595 ఓట్లు సాధించి 47,872 ఓట్ల మెజారిటీతో ముందున్నారు. పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు 36,723 ఓట్లు సాధించారు. ఐదో రౌండ్ పూర్తయ్యే సరికి 1,40,297 ఓట్లు లెక్కించగా ఇందులో చెల్లని ఓట్లు 14,888.

లెక్క మీది...కిక్కు మాది

ముదినేపల్లి : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా సోమవారం మద్యం ప్రియులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. లెక్క మీది...కిక్కు మాది అన్నట్లుగా మందుబాబులు మద్యం తాగడం ఆపనే లేదు. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్సైజ్ శాఖ ఆదేశాల మేరకు మద్యం షాపులను మూసినప్పటికీ అనధికారికంగా మద్యం అమ్మకాలు జోరుగానే జరిగాయి. ముదినేపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో మందుబాబులు బహిరంగ ప్రదేశాల్లోనే మద్యం మత్తులో మునిగితేలారు.



ముదినేపల్లిలో బహిరంగంగానే మద్యపానం

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

ఏలూరు క్రైం : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రమైన సర్ సీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వద ఎస్పీ కేపీఎస్ కిశోర్ పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసి స్వయంగా పరిశీలించారు. సోమవారం వేకువజామునే కౌంటింగ్ విధులకు నియమించబడిన ఉద్యోగులు, ఏజెంట్లను పోలీస్ సిబ్బంది మెటల్ డిటెక్టర్లతో, బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీలు నిర్వహించారు. సెల్‌ఫోన్‌లు బయట కౌంటర్‌లోనే ఉంచేలా చర్యలు తీసుకున్నారు. బందోబస్తులో ఏఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, ఎఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డీఎస్పీ యుగంధర్ పలువురు అధికారులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్



బ్యాలెట్ బాక్స్‌లు తీసుకువస్తున్న సిబ్బంది



విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు
50 శాతం రాయితీ

కిలో వాట్‌కు రూ.వెయ్యి చార్జి

జూన్ 30 వరకు గడువు

నరసాపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దశాబ్దం క్రితం విద్యుత్ కనెక్షన్ తీసుకున్న వారికి ప్రస్తుతం వినియోగం పెరగడం సాధారణం. కనెక్షన్ తీసుకున్న సమయంలో కట్టిన డిపాజిట్‌కు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. లేకుంటే అధికారుల తనిఖీల్లో జరిమానా విధిస్తున్నారు. డిపాజిట్ భారంతో వినియోగదారులు వెనకాడడంతో ప్రభుత్వం రాయితీ ప్రకటించింది. కిలోవాట్‌కు రూ.2 వేలు చెల్లించాల్సి ఉండగా రూ.వెయ్యి చెల్లించి క్రమబద్ధీకరించే వెసులుబాటు కల్పించింది.

50 శాతం క్రమబద్ధీకరించాలి

జిల్లాలో ప్రస్తుతం 6.47లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 30శాతం కనెక్షన్లు సక్రమంగా డిపాజిట్ చెల్లించగా మరో 20శాతం మంది నోటీసులకు స్పందించి క్రమబద్ధీకరించుకున్నారు. 50శాతం మంది విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా రెగ్యులర్ చేయించుకోవాల్సి ఉంది. పెరుగుతున్న వాడకానికి అనుగుణంగా 1 నుంచి 2 కిలోవాట్లకు డవలప్‌మెంట్ చార్జీలను చెల్లించాల్సి ఉంది. కిలో వాట్‌కు రూ.వెయ్యి, రూ.200 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లిస్తే సరిపోతుంది. దీనితో సర్వీస్ క్రమబద్ధీక రించినట్లే. చెల్లింపునకు జూన్ 30 వరకు గడువు ఉంది.

వినియోగదారులకు ఎంతో మేలు



ఈ అవకాశం వినియోగదారులకు ఎంతో మేలు. గతంతో పోలిస్తే 3 నుంచి 4 రెట్లు వినియోగం పెరిగింది. తనిఖీల సమయంలో కొందరికి జరిమానా కూడా విధించాం. ప్రస్తుతం కంప్యూటీకరణతో వినియోగదారుల వాడకంపై బిల్లుల ద్వారా స్పష్టత ఉంది. ప్రస్తుతం కిలోవాట్‌కు కట్టే డిపాజిట్‌పై 50 శాతం రాయితీ ఇచ్చారు. కిలో వాట్‌కు రూ.వెయ్యి కడితే సరిపోతుంది. మరో రూ.200 సెక్యూరిటీ డిపాజిట్ కట్టాల్సి ఉంటుంది. బిల్లును బట్టి నేరుగా వినియోగదారు ఆన్‌లైన్‌లో క్రమబద్ధీకరించుకోవచ్చు. లేదా సంస్థ కార్యాలయం వద్ద కూడా చెల్లించవచ్చు.

- మధుకుమార్, ట్రాన్స్‌కో ఈఈ





45 కిలోమీటర్ల రహదారి..
రూ.2400 కోట్లు

ఆకివీడు నుంచి దిగమర్రు రహదారి సమగ్ర పాజెక్ట్ నివేదిక సిద్ధం

- 165 హైవేకు డీపీఆర్
- కేంద్రానికి సమర్పించిన అధికారులు
- నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి రూ.2400 కోట్లు
- పెరిగిన అంచనా వ్యయం

జిల్లాలో అత్యంత ప్రధానమైన 165 జాతీయ రహదారికి సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. ఆకివీడు నుంచి దిగమర్రు వరకు 45 కిలోమీటర్ల నాలుగు లైన్ల జాతీయ రహదారి విస్తరణకు డీపీఆర్ రూపొందించడానికి అధికారులు భారీ కసరత్తు చేసి, కేంద్రానికి సమర్పించారు. రూ.2400 అంచనా వ్యయంతో ఈ ప్రతిపాదనలు వెళ్లాయి. గతంతో పోలిస్తే ఈ వ్యయం రెట్టింపు అయింది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆకివీడు మీదుగా దిగమర్రు రహదారి రెండు లైన్లుగా విస్తరించడానికి గతంలో రూ. 1200 కోట్లతో అంచనా రూపొందించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆకివీడు నుంచి దిగమర్రు వరకు నాలుగు లైన్‌ల రహదారి విస్తరణకు అంచనా రూపొందించింది. వాస్తవానికి పామర్రు నుంచి ఆకివీడు మీదుగా దిగమర్రు వరకు 165 జాతీయ రహదారి విస్తరించి ఉంది. తొలిదశలో పామర్రు-ఆకివీడు వరకు నిర్మాణం చేపట్టారు. అక్కడ రెండు లైన్ల రహదారి మాత్రమే ఏర్పాటు చేశారు. ఆకివీడు నుంచి దిగమర్రు వరకు రెండో దశ ప్రాజెక్ట్ చేపట్టాలి. కూటమి ప్రభుత్వ నాలుగు లైన్ విస్తరణ ప్రతిపాదనతో అంచనా వ్యయం కూడా రెట్టింపయ్యింది. రూ. 2400 కోట్లు వ్యయం కానుందని డీపీఆర్ సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఈ నెలాఖరులోగా కేంద్రం ఆమోద ముద్ర వేయాలి. అప్పుడే గతలో కేటాయించిన రూ.1200 కోట్లు మనుగడలో ఉంటాయి. కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మపై జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదా రులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. తాజా డీపీఆర్ కేంద్రం ఆమోదిస్తుందన్న నమ్మకం అందరిలో నెలకొంది.

పెరిగిన భూ వ్యయం

జిల్లాలో గడచిన పదేళ్లగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెరిగింది. దాని ఆధారంగానే రైతులకు పరిహారం అందించాలి. అంచనా వ్యయం పెరగడానికి కూడా ఇది ఒక కారణం. ఆకివీడు, ఉండి. కాళ్ల, భీమవరం రూరల్, వీరవాసరం, పాలకొల్లు రూరల్ మండల గ్రామాల మీదుగా జాతీయ రహదారి వెళుతోంది. ఆక్వా చెరువులు విస్తరించి ఉన్నాయి. రొయ్యల చెరువుల కారణంగా లవణీయత ఉండడంతో దానిని తొలగించి తర్వాత మట్టితో పూడ్చాలి. డెల్టా ప్రాంతంలో మట్టి తరలించాలంటే రవాణా భారం అధికం. జాతీయ రహదారి నిర్మాణంలో వినియోగించే మెటల్‌ను ఏలేశ్వరం ప్రాంతం నుంచి దిగుమతి చేసుకోవాలని అధికారులు నిర్ణయించారు. పంగిడి వద్ద లభించే మెటల్ రహదారి నిర్మాణానికి అనువుగా లేదని అధికారులు తేల్చేశారు. ఇలా జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన ముడి సరుకు కూడా ఆర్థిక భారాన్ని పెంచింది. దాదాపు 15 గ్రామాల పరిధిలో రాకపోకలు సాగించేందుకు జాతీయ రహదారికి కింది నుంచే వెళ్లేలా వంతెనలు ఏర్పాటు చేస్తున్నారు. సర్కిల్‌ను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అందుకే కింది నుంచి వెళ్లిపోయేలా నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. అక్కడ జాతీయ రహదారిపైకి వెళ్లేలా, కిందికి దిగేలా అప్రోచ్ రహదారులను ఏర్పాటు చేస్తారు. ర్యాంప్‌ల మాదిరిగా రహదారి నిర్మాణం ఉంటుంది. దీనికోసం కూడా అదనపు వ్యయం అవుతోంది. ఇవన్నీ డీపీఆర్ అంచనాలను పెంచాయి.

మూడు ఆర్‌వోబీలకు చెక్

తాజా ప్రతిపాదనలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు లేకుండా చేశారు. లేదంటే జాతీయ రహదారి నిర్మాణానికి ఏళ్ల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. రైల్వే అనుమతులు అంత వేగంగా లభించే అవకాశం లేదు. ఆర్‌వోబీల నిర్మాణం లేకుండా భీమవరం రూరల్ గ్రామాల మీదుగా జాతీయ రహదారి వెళుతోంది. ఫలితంగా రహదారి నిర్మాణం త్వరితంగా పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తాజాగా సమర్పించిన డీపీఆర్‌పై కేంద్ర ఆమోదం కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.



ఇంటర్ సెకండియర్
పరీక్ష ప్రశాంతం

502 మంది గైర్హాజరు

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సెకండియర్ తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 52 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. జనరల్ విద్యార్థులు 14,908 మంది హాజరుకావాల్సి ఉండగా 409 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1544 మందికి 93 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ జరగలేదని డీవైఈవో నాగేశ్వరరావు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు ప్రత్యేక స్క్వాడ్స్, పలుచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

అక్రమ లేఅవుట్లు

పాలకోడేరులో రెచ్చిపోతున్న రియల్టర్లు



పాలకోడేరు లేఅవుట్‌లో తొలగించిన హెచ్చరిక బోర్డు

- విచ్చలవిడిగా వెలుస్తున్న ప్లాట్లు
- అధికారికమేనంటూ అమ్మకాలు
- అధికారుల హెచ్చరిక బోర్డులు
- బేఖాతరు అంటున్న వ్యాపారులు
- తిరుగుబాటు.. బెదిరింపులు
- కేసులు పెడతామంటున్న సిబ్బంది

పాలకోడేరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన భీమవరానికి ఆనుకుని పాలకోడేరు మండల కేంద్రంలో అక్రమ లేఅవుట్లు విచ్చలవిడిగా వెలిశాయి. అన్ని అనుమతులు ఉన్నాయంటూ నమ్మబలికి అనధికారికంగా విక్రయాలు సాగిస్తున్నారు. అధికారులు చర్యలు చేపడితే రియల్టర్లు తమదైన శైలిలో రెచ్చిపోతున్నారు.

పాలకోడేరులో సుమారు 11 నాన్ లే అవుట్‌లలో ఇటీవల పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వాటిని కొందరు తొలగించారు. పాలకోడేరు నుంచి మోగల్లు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో బోర్డులను ఒక వైసీపీ నాయకుడు తొలగించడమే కాకుండా మరోమారు బోర్డు ఏర్పాటుచేస్తే మీ అంతు చూ స్తామంటూ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న మరో లేఅవుట్‌లో ఏర్పాటుచేసిన బోర్డును కూడా మరొక వ్యాపారి తొలగించడమే కాకుండా పంచాయతీ కార్యాలయానికి వద్ద వీరంగం సృష్టించారు. అధికారికంగా ఏర్పాటు చేసిన బోర్డులను అనధికారికంగా తొలగించడమే కాకుండా సం బంధిత అధికారులపై దౌర్జన్యం చేసేవిధంగా ప్రవర్తించడం విపరీత పరిణామం. మండలంలో ఈ అరాచకాలకు కొందరు అధికారులు కూడా వత్తాసు పలుకుతున్నట్లు సమాచారం.

పాలకోడేరులో సుమారు 60 ఎకరాల్లో లేఅవుట్లు ఉన్నట్లు ఒక అంచనా. వీటిని సక్రమంగా మార్చుకుంటే పంచాయతీకి సుమారు 6 ఎకరాల స్థలం సమకూరే అవకాశం ఉంది. అనుమతులు, నిబంధనలపై దృష్టి పెట్టేవారు లేరు. ఇదే అదనుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

అక్రమాల పుట్ట

మండల కేంద్రమైన పాలకోడేరులో నాన్ లే అవుట్‌లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. కనీస నియమ నిబంధనలు పాటించకుండా, అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలు, కాలువ గట్లు, పంట బోదెలను ఆక్రమించి లేఅవుట్‌లు ఏర్పా టుచేశారు. అనధికారిక లేఅవుట్లలో కొందరు పలుకుబడి ఉపయోగించి విద్యుత్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేసేశారు. వీటికి అన్ని అనుమతులు ఉన్నాయంటూ ప్రచారం చేసుకుంటూ ప్లాట్ల విక్రయాలు సాగిస్తున్నారు. కొందరు అధికారుల వత్తాసుతో అక్రమ వ్యవహారం సాఫీగా సాగుతుంది.

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

నాన్ లే అవుట్లలో పంచాయతీ హెచ్చరిక బోర్డులను తొలగించిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. వీరందరిపై పాలకోడేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. అనధికారిక లేఅవుట్ ఒక తప్పయితే సిబ్బంది ఏర్పాటుచేసిన బోర్డులను తొలగించడం మరింత నేరం.

- రాంప్రసాద్, ఈవోపీఆర్డీ, పాలకోడేరు



కొల్లేటికోట పెద్దింటమ్మకు
ప్రత్యేక పూజలు

కైకలూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటమ్మ ఉత్సవాల్లో సోమవారం మూడో రోజు జలదుర్గ సమేత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి కలశపూజ, ఖడ్గ నామార్చన, ధూపసేవ, బాలబోగం, పంచ హారతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ చేశారు. సాయంత్రం ముదినేపల్లి గ్రామానికి చెందిన కె.లక్ష్మీకుమారి గీతా పారాయణ చేశారు. ఈవో కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యేల వాయిస్


రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వండి



గత సంవత్సరం జూలై నెలలో వరదలకు పంట నష్టానికి గురైన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి. రైతులకు ఆగస్టు నెలలో నష్టపోయిన పరిహారం అందించారు. కానీ జూలై నెలలో పంట నష్టంపై అధికారులు ఇప్పటికే రూ.28 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు. అధికంగా తాడేపల్లి గూడెం నియోజకవర్గంలోని ఎర్రకాలువ పరీవాహక గ్రామాల రైతులకు సబ్సిడీ అందాల్సి ఉంది.

- ప్రభుత్వ విప్, బొలిశెట్టి శ్రీనివాస్

రైతుల్ని ఆదుకోవాలి



గత ఏడాది అధిక వర్షాలు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. రూ.26కోట్ల ఇన్ పుట్ సబ్సిడీ తక్షణమే విడుదల చేయాలి. తణుకు నియో జకవర్గంలో ఎర్రకాలువ ముంపు కారణంగా జూలై నెలలో వరదలు వచ్చాయి. ఈసమయంలో పెద్ద ఎత్తున రైతులు పంట నష్టపోయారు. అప్పట్లో అధి కారులు, మంత్రులు సైతం సందర్శించి రైతులకు హామీ ఇచ్చారు. నిడదవోలు, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, ఉండి నియోజక వర్గాల పరిధిలో బాధిత రైతులు ఉన్నారు.

- ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎమ్మెల్యే

కాలవలు ప్రక్షాళన చేయాలి



గత ప్రభుత్వం భీమవరం నియోజకవర్గంలో ఏ కాల్వలోను ఒక తట్ట చెత్త గాని తూడు గాని తీయలేదు. దీని వల్ల నియోజకవర్గంలోని వీర వాసరం, భీమవరం మండలాల్లో మొదటి క్రాప్‌లో వ్యవసాయం చెయ్యలేని పరిస్థితి నెలకొన్నది. రబీ సీజన్‌లో శివారు ప్రాంతాలకు నీరు అందటంలేదు. అన్నపూర్ణగా పేరు ఉన్న డెల్టా ప్రాంతం ఎడారిగా మారే పరిస్థితి వచ్చింది. దీనిపై యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పి. రామాంజనేయులు-భీమవరం ఎమ్మెల్యే

రైళ్లలో ఏదీ భద్రత..?

» రైల్వేస్టేషన్లలో పోలీసుల కొరత » నరసాపురం రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఒకే ఒక్క ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ » జిల్లాలో 26 మంది జీఆర్పీ పోలీసులకు గాను ఉన్నది ఐదుగురే » రైళ్లలో పెరుగుతున్న నేరాలు » కొరవడిన రక్షణ



నరసాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):ఇటీవల లింగంపల్లి నుంచి నరసాపురం వస్తున్న రైళ్లలో ఫోన్ దొంగలించి పారిపోతుండగా ప్రయాణికుడు పట్టుకున్నాడు. నిందితుడిని విచారిస్తే 16కుపైగా చోరీకిగురైన సెల్‌ఫోన్లు బయటపడ్డాయి. గతంలో ఎన్నో చోరీలు చేసినట్లు పోలీస్ విచారణలో తేలింది. ఇదే రైలులో ల్యాప్‌ట్యాప్‌లు, చైన్‌స్నాచింగ్‌లు కూడా జరిగాయి. ఈ చోరీల్లో చిక్కుముడి వీడలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కేసులు ఉన్నాయి. వీటి నియంత్రణకు రైల్వే నిర్లక్ష్యమే కారణమన్న వాదనలు లేకపోలేదు. జిల్లాలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో ఉండే జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పూర్తి స్థాయిలో లేరు. నరసాపురం ఆర్పీఎఫ్ స్టేషన్‌లో పది మంది కానిస్టేబుళ్లు ఉండాలి. ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. ఎస్సై కూడా లేరు. ఇలా జిల్లాలోని భీమవరం, తణుకు, టీపీగూడెం స్టేషన్లలో కూడా పూర్తి స్థాయిలో ఆర్పీఎఫ్ సిబ్బంది లేరు. ఈకారణంగా రాత్రి సమయాల్లో గస్తీ కూడా తగ్గిపోయింది. జిల్లా మీదుగా రోజు 45కు పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. వాటిలో లింగంపల్లి, నాగర్‌సోల్, ధర్మవరం, శేషాద్రి, సర్కార్, ఎల్‌టీటీ, విశాఖపూరీ వంటి ప్రధాన రైళ్లు ఉన్నాయి. వీటిలో ఎక్కువ రైళ్లు రాత్రి పూటే నడుస్తున్నాయి. సిబ్బంది తక్కువుగా ఉండటంతో అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు.

సిబ్బంది కొరత

జిల్లాలో నరసాపురం ప్రధాన రైల్వే స్టేషన్. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్ల నిర్వహణ ఈస్టేషన్‌లోనే జరుగుతుంది. వచ్చిన ప్రతి రైలును జీఆర్పీ పోలీసులు తనిఖీ చేయాల్సి ఉంటుంది. వాటిలో ఏమైనా పోతే వాటిని పరిశీలించి రిపోర్టు చేయాలి. అలాగే ప్రయా ణికులు సామాన్లు మరిచిపోయినా... చోరీలు జరిగినా ఆ వివరాలను సేకరించాల్సి ఉంటుంది. రాత్రి పూట నిలిచిపోయిన రైళ్లలో చోరీలు జరగకుండా పర్యవేక్షి ంచాల్సి ఉంటుంది. ఇక ప్రయాణికులు రైళ్లు ఎక్కేట ప్పుడు తొక్కిసలాట జరగకుండా వారిని క్యూలో నిలబెట్టి జనరల్ బోగీలు ఎక్కించాలి. ఇలాంటి కీలక బాధ్యతల్ని ఆర్పీఎఫ్ పోలీసులు చేపడతారు. అయితే ప్రధానమైన స్టేషన్లలో పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల ప్రయాణికులకు రక్షణ లేకుండా పోయింది. ఇటు ఉన్న సిబ్బందిపైనే ఒత్తిడి పెరిగిపోతున్నది. దీంతో ఒత్తిడి భారాన్ని తట్టుకోలే ఉన్న కొద్దిపాటి సిబ్బంది కూడా సెలవుపై వెళ్లిపోతున్నారు. ఈపరిస్థితి భీమవరం, తణుకు, టీపీగూడెం స్టేషన్లకు తప్పలేదు. రైల్వేకు సంబంధించి లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణ జీఆర్పీ పోలీసులదే. రైళ్లలో గొడవలు జరిగినా... ఆత్మ హత్యలు చేస్తున్నా...చోరీలు జరిగినా... ఆ కేసుల్ని జీఆర్పీ లే కేసులు కడతారు. అంటే శాంతిభద్రతలకు సంబంధించిన పోలీసులు జిల్లాలో 28 మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం ఆరుగురు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఈకారణంగా అరకొర సిబ్బందితో రైల్వేకు సంబంధించి లా అండ్ ఆర్డర్‌ను నిర్వహించడం కత్తి మీద సాములా మారింది. ఈ సమస్యపై వివరణ అడిగితే ఏ అధికారి నో కామెంట్ అంటారు. రైళ్లలో వెళ్లే ప్రయాణికులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత రైల్వేదే. అయితే దీనిపై రైల్వే పట్టించుకోవడం లేదన్న వాదనలు ప్రయాణికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

బీ.. ఏ హ్యూమన్ లఘు చిత్రానికి జాతీయస్థాయి గుర్తింపు



దర్శకుడు నవీన్‌తో చిత్ర బృందం

ఏలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మానవహక్కులపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో జాతీయ మానవ హక్కుల సంఘం నిర్వహించిన లఘు చిత్రాల పోటీల్లో జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన నవీన్ లొట్ల దర్శకత్వంలో చిత్రీకరించిన బీ.ఏ హ్యూమన్ లఘుచిత్రం 2024కు గాను సర్టిఫికెట్ ఆఫ్ స్పెషల్ మెన్షన్‌కు ఎంపికై రూ.50 వేల నగదు బహుమతి పొందినట్టు నవీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2015 నుంచి జాతీయ మానవ హక్కుల సంఘం నిర్వహిస్తున్న లఘు చిత్రాల పోటీలలో 303 లఘు చిత్రాలు పోటీ పడ్డాయని తెలిపారు. వాటిలో ఏడు లఘు చిత్రాలు విజేతలుగా నిలువగా నవీన్ లొట్ల దర్శకత్వం వహించి నిర్మించిన బీ.ఏ హ్యూమన్ లఘు చిత్రానికి సర్టిఫికెట్ ఆఫ్ స్పెషల్ మెన్షన్‌గా ఢిల్లీలోని జాతీయ మానవహక్కుల సంఘం చైర్మన్ జస్టిస్ సి.రామ సుబ్రమణి యన్‌తో పాటు కమిషన్ జ్యూరీ పరిశీలించి ఎంపిక చేశారన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, గృహ హింస, ఆడ బిడ్డలను అనాధలుగా వది లేయడం, సమాజ జోక్యం ఇతివృత్తంగా నిర్మించిన తమ లఘు చిత్రం జాతీయ స్థాయిలో ఎంపికవడం పట్ల నవీన్‌తో పాటు చిత్రబృందం హర్షం వ్యక్తం చేసింది. ఈ ప్రోత్సాహంతో మరిన్ని సమాజ హిత లఘు చిత్రాలు నిర్మిస్తానని నవీన్ లొట్ల తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో నన్నయ విద్యార్థినికి వెండి పతకం



విజేత రామలక్ష్మిని అభినందిస్తున్న వీసీ ప్రసన్న శ్రీ

రాజమహేంద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 87కేజీల కేటగిరిలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థిని కర్నాటి నాగరామలక్ష్మి వెండిపతకం సాధించారు. ఈ సందర్భంగా విజేతను వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ సన్మానించి పతకం, ట్రోఫీని అందజేశారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో గత నెల14 నుంచి17 వరకు జరిగిన చాంపియన్‌షిప్‌లో నన్నయ అనుబంధ కళాశాలైన భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాల విద్యార్థిని నాగరామలక్ష్మి ప్రతిభ కనబరిచి ఏప్రిల్‌లో గోవాలో జరిగే ఖేలో ఇండియా పోటీలకు ఎంపికయ్యారన్నారు.



నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేస్తున్న కార్మికులు

మునిసిపల్ కార్మికుల నిరసన

ఏలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నల్లబాడ్జీలు ధరించి మునిసిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ మాట్లాడుతూ ఈ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల మూడవ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద, ఆరో తేదీన విజయవాడలో జరగవలసిన ధర్నా కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొక్కా శ్రీనివాసరావు, కంతేటి వెంకట్రావు, నిమ్మల సుబ్బారావు, దోసూరి నాగరాజు, అయినాల ముత్యాలరావు, అప్పలస్వామి, బాలు, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కొఠారు ఇంటి వద్ద ఉద్రిక్తత

బకాయి సొమ్ము అడగడానికి వెళ్తే దాడి చేశారని బాధితుల ఆవేదన





కొఠారు ఇంటి దగ్గర ఇరువర్గాలను నిలువరిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్ లో) ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్న సురేశ్

పెదవేగి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : బకాయి సొమ్ము కోసం ధర్నా చేస్తుంటే దాడి చేశారని కొల్లేరు లంక గ్రామస్తులు తెలిపారు. వైసీపీకి చెందిన దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తమ చెరువులను సాగు చేసుకుని, ఐదేళ్లలో రూ.9కోట్లను బకాయి పడ్డారని, ఈ సొమ్ము రాబట్టుకోవడం కోసం రెండు నెలలుగా అబ్బయ్య చౌదరి ఇంటి దగ్గర ధర్నా చేస్తున్నామని తెలిపారు. రెండు నెలలుగా చేస్తున్న ధర్నాలో భాగంగా సోమవారం కొఠారు ఇంటిదగ్గర ధర్నా చేస్తున్నామని, ఈలోగా వైసీపీ నాయకులు కొంతమంది కూలీలను తీసుకొచ్చి తమపై దాడికి తెగబడ్డారని వారు ఆరోపించారు. దాడి సమాచారం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు అక్కడకు చేరుకుని లంక గ్రామస్తులకు అండగా నిలిచారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు నూజివీడు డీఎస్పీ కేవీఎస్‌వీ.ప్రసాద్ ఆధ్వర్యంలో పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ కె.రామకృష్ణ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఘర్షణ సమయంలో టీడీపీకి చెందిన అన్నపనేని సురేష్‌పై కొంతమంది వైసీపీ నాయకులు దాడిచేసి గాయపర్చారు. దీంతో అతనికి ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు

చిరు వ్యాపారులకు విద్యుత్ బిల్లుల షాక్

» కూల్‌డ్రింక్ షాపునకు రూ.1,96,574 బిల్లు » టీ దుకాణదారుడికి రూ.55,423 » సిబ్బంది తప్పిదాలతో వినియోగదారుల లబోదిబో



చిరు వ్యాపారులకు వచ్చిన విద్యుత్ బిల్లులు

ద్వారకాతిరుమల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పెరిగిన విద్యుత్ బిల్లులతో భారంగా బావిస్తున్న తరుణంలో విద్యుత్ సిబ్బంది తప్పిదాల వల్ల వినియోగదారులు మరింత ఇబ్బంది పడుతున్నారు. ద్వారకాతిరుమలలో యూనియన్ బ్యాంక్ సమీపంలోని ఓ కూల్‌డ్రింక్ షాపు యజమానికి ఈ మార్చి1న తీసిన విద్యుత్ బిల్లు ఏకంగా రూ.1,96,574 రావడంతో ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. ప్రతినెల తనకు రెండువేల నుంచి మూడువేల రూపాయలలోపు బిల్లు వస్తుందని ఈసారి మాత్రం లక్షల్లో బిల్లు వచ్చిందని వాపోయాడు. గుడి సెంటర్‌లో ఉన్న ఓ టీ దుకాణదారుడు అప్పన్నకు ప్రతి నెల రూ.400లోపు బిల్లు వస్తుండగా ఈ నెల మాత్రం రూ.55,423 విద్యుత్‌బిల్లు రావడంతో ఒక్కసారిగా కుదేలయ్యాడు. చిరువ్యాపారులమైన తాము ఈ విద్యుత్ బిల్లులు చూసి బెంబేలెత్తుతున్నట్లు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు తమ బిల్లులు సరి చేయాలని కోరుతున్నారు.

ప్రశాంతికి యంగ్ రీసెర్చ్ ఉమెన్ అవార్డు



అవార్డు అందుకున్న ప్రశాంతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం నన్నయ్య యూనివర్శిటీ క్యాంపస్ రసాయన శాస్త్ర విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ ఎస్ ప్రశాంతికి చెన్నై వీనస్ ఫౌండేషన్ ద్వారా యంగ్ ఉమెన్ రీసెర్చ్ ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీ అవార్డుతో సత్కరించారు. అంతర్జాతీయ ప్రచురణలు, పేటెంట్‌లు, రచించిన పుస్తకాలతో సహా ఆమె అసాధారణమైన పరిశోధనా సహకారాలకు గుర్తింపుగా ఈ అవార్డు అందించారు. అవార్డు అందుకున్న ప్రశాంతిని క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి అశోక్, క్యాంపస్ ఫ్యాకల్టీ సిబ్బంది అభినందించారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలు

ఏలూరు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభు త్వ, జడ్పీ, మండల పరిషత్, పురపాలక సంఘాలు, ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్యాల పాఠశాలల్లో పని చేస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సాధారణ సీనియార్టీ జాబితాలను డీఈవో వెంకటలక్ష్మమ్మ సోమవారం విడుదల చేశారు. పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలోని 48 మండలాలకు సంబంధించిన అన్ని యాజమాన్యాల్లో (ప్రైవేటు మినహా) పనిచేస్తున్న మొత్తం 11,388 మంది హెచ్‌ఎంలు, ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజి పండిట్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు సీనియార్టీ నెంబర్లను కేటాయించారు. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టిఐఎస్) ఆధారంగా రూపొందించిన ఈ జాబితాలను డీఈవో ఏలూరు.ఓఆర్‌జీ వెబ్‌సైట్, డీఈవో కార్యాలయ నోటీస్ బోర్డుల్లో అందుబాటులో ఉంచామన్నారు. సీనియార్టీ జాబితాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 10వ తేదీలోగా ఏలూరు డీఈవో/కాకినాడ ఆర్జేడీ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. అభ్యంతరాలను లేవనెత్తే ఉపాధ్యాయులు సీనియార్టీ జాబితాలో ఎక్కడ తప్పిదం చోటుచేసుకున్నదీ ఆధారాలతోసహా పూర్తి వివరాలను స్పష్టంగా పేర్కొంటూ అందజేయాలని కోరారు. ప్రభుత్వం ఉమ్మడి జిల్లాస్థాయిలో ఏర్పాటుచేసిన ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి తుదినిర్ణయం తీసుకుని సంబంధిత హెచ్‌ఎం/టీచరుకు తెలియజేస్తుందని వివరించారు. మరిన్ని వివరాలకు ఏలూరుజిల్లా డీఈవో కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురి మృతి

అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి



పాలకోడేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విస్సాకోడేరు గ్రామంలోని వంకాయలపాలెం రోడ్డులో ఉదరాల వెంకట్రావు (62) సోమవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఇతనికి మానసికంగా ఇబ్బంది పడుతున్న కుమారుడు, వివాహమైన ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇతను చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవితాన్ని సాగిస్తున్నాడు. వంకాయలపాలెం రోడ్డులోని రామాలయం వెనుక మృతదేహాన్ని గుర్తించారు. తలపై, ఒంటిపై గాయాలు ఉండటంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకువెళ్ళి కార్యక్రమాలు నిర్వహించినట్లుగా స్థానికులు అంటున్నారు. దీనిపై పాలకోడేరు పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

పంటబోదెలో మృతదేహం



పాలకోడేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరు గ్రామంలోని దళితపేట చెరువును ఆనుకుని పంట బోదెలో గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం రాత్రి స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పంటబోదె సమీపంలో తాడేపల్లి గూడెం వెళ్ళే రహదారిని ఆనుకుని మద్యం షాపు ఉండటంతో ఆ మద్యం షాపులో మద్యం తీసుకోవడానికి వెళ్లి పంటబోదెలో పడి ఉంటాడని స్థానికులు అంటున్నారు. ఇతని ఒంటిపై పచ్చరంగు లుంగీ, లైట్ కలర్ షర్ట్‌తోపాటు గెడ్డం, చింపిరి జుట్టు కలిగి ఉన్నట్లుగా స్థానికులు అంటున్నారు. ఇతని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాలు ఉండవచ్చని స్థానికులు తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

మొగల్తూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వై.నాగలక్ష్మి తెలిపారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం మూలలంకకు చెందిన కడలి నాగరాజు (55) ఈనెల 1వ తేదీన మూలలంక నుంచి నరసాపురం బైక్‌పై వెళుతుండగా ముత్యాలపల్లి పంచాయతీ చింతరేవు బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో నాగరాజును నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడన్నారు. మృతుని భార్య దుర్గామహేశ్వరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో శవమై..

నరసాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగు రోజుల క్రితం కనిపించకుండా పోయిన మహిళ సోమవారం గోదావరిలో శవమై తేలింది. ఎస్ఐ జయలక్ష్మి వివరాల ప్రకారం.. అరుంధతిపేటకు చెందిన శృతికుమారి(24) ఈనెల 1న భర్తతో కలిసి అన్నక్యాంటీన్‌లో టిఫిన్ చేశారు. భర్త పని ఉందని వెళ్లిపోవడంతో తాను ఇంటికి వెళ్లాతానని చెప్పింది. భర్త ఇంటికి వచ్చే సరికి రాకపోవడంతో సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా సోమవారం బాపుఘాట్ వద్ద మహిళ మృతదేహం ఉందన్న సమాచారం పోలీసులకు వచ్చిందన్నారు. బయటకు తీసి చూడగా శృతికుమారి మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించారన్నారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మోటార్ సైక్లిస్టు దుర్మరణం

పెంటపాడు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెంకు చెందిన అలిసిపూడి శ్రీనివాస్ (50) పని నిమిత్తం ద్విచక్రవాహనంలో ప్రత్తిపాడు గ్రామానికి వచ్చాడు. తిరిగి తాడేపల్లిగూడెం వెళుతుండగా అలంపురం జాతీయ రహదారిపైకి చేరుకోగానే వెనుక నుంచి వస్తున్న ఐషర్ వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

డ్రెయిన్‌లో మరో మృతదేహం

ఉండి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉండి ఇరిగేషన్ కార్యాలయం పక్కన వున్న బొండాడ డ్రెయిన్ మురుగుకాలువలో 35 నుంచి 40 సంవత్సరాలు గల గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు నలుపు రంగు డ్రాయర్ వేసుకుని వున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం ఉండి నుంచి ఉప్పుగుంటకు వెళ్లే పంటకాలువలో బ్లూరంగు జీన్స్ ప్యాంటు వేసుకుని వున్న ఇదే వయసుగల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ



ఇంటి యజమానితో మాట్లాడుతున్న డీఎస్పీ డాక్టర్ శ్రీవేద

నరసాపురం టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టీమర్‌రోడ్ రామాలయం పక్కన నివాసం ఉంటున్న యల్లాప్రగడ వెంకటరత్నం ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బీరువాలు పగలగొట్టి తొమ్మిది కేజీల వెండి దోచుకుపోయారు. నాలుగు రోజుల క్రితం వెంకటరత్నం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. ఉదయం తలుపు తీసి ఉండటాన్ని స్థానికులు గుర్తించి వెంకటరత్నంకు ఫోన్ చేశారు. వెంటనే ఆయన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రీవేద, సీఐ యాదగిరి సంఘటన స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీంను రప్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జయలక్ష్మి చెప్పారు

పోలీసులకు మతిస్థిమితంలేని వ్యక్తి అప్పగింత



ఏలూరు క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఒక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ ఒక మహిళ వెనుక వెళుతుండడంతో ఆమె మెడలో గొలుసు తెంపుతాడనే భయంతో స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం బీహార్‌నకు చెందిన ఒక వ్యక్తి అనుమానాస్పదంగా అటు ఇటు ఆ గ్రామ ప్రధాన సెంటర్లలో తిరిగాడు. ఒక మహిళ వెళ్తుంగా ఆమె వెనుక వెళుతుండడంతో చైన్ స్నాచింగ్ చేయడానికి పాల్పడుతున్నాడనుకుని స్థానికులు అతనిని పట్టుకున్నారు. ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడం హెడ్‌కానిస్టేబుల్ జీవరత్నం వచ్చి అతనిని తీసుకువెళ్ళి ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారించారు. అతని మానసిక స్థితి సరిగా లేదని ఏదో రైలులో వచ్చి ఇలా తిరుగుతున్నట్లుగా గుర్తించారు. మొత్తం మీద అతను మతి స్థిమితం లేనట్లుగా గుర్తించారు.

నేటి నుంచి నన్నయలో నారీఫెస్ట్

రాజమహేంద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 4 నుంచి మూడురోజుల పాటు నారీఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సోమవారం తెలిపారు. తొలిరోజైన మంగళవారం మామ్మ(అమ్మమ్మ నానమ్మ)మనవరాలు ఫ్యాషన్‌షో, హెల్దీబేబీ పోటీలు జరుగుతాయన్నారు. హెల్దీబేబీ పోటీల్లో ఐదేళ్ల లోపు బాలబాలికలు పాల్గొనేందుకు అర్హులన్నారు. స్థానిక మహిళలందరూ ఈ పోటీల్లో పాల్గొనాలని వీసీ కోరారు. హెల్దీబేబీ పోటీలకు 63057 89433, మామ్మ-మనవరాలు పోటీలకు 99126 62500 నెంబర్లను సంప్రదించాలన్నారు. 5న వర్శిటీలో నన్నయ యూనివర్శిటీ, అనుబంధ కళాశాల మహిళా సిబ్బందికి వివిధ పోటీలు, 6న అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహిస్తామని వీసీ పేర్కొన్నారు.

నిందితులను కస్టడీకి ఇవ్వండి

నాన్ డ్యూటీ పెయిడ్ మద్యంపై కోర్టులో ఎక్సైజ్‌శాఖ పిటీషన్

నరసాపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం కేసులో నిందితులకు బెయిల్ ఇవ్వొద్దని ఎక్సైజ్‌శాఖ కోర్టులో పిటీషన్ వేసినట్లు ఆశాఖ సీఐ రాంబాబు చెప్పారు. సోమవారం సర్కిల్ కార్యాల యంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈకేసును ఎక్సైజ్‌శాఖ ఛాలెంజ్‌గా తీసుకుందన్నారు. ఈనెల 26వ తేదీన నరసాపురం మండలం కొప్పర్రు గ్రామంలో 4,125 నిబ్‌లు పట్టుకున్నారు. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పరారీలో ఉన్న ఐదోవ నిందితుడు భరత్‌రెడ్డిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే యానాం, పరసర ప్రాంతాల్లో అతని కోసం గాలించామన్నారు. ఈకేసు దర్యాప్తును భీమవరం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆర్వీ ప్రసాద్‌రెడ్డికి ప్రభుత్వం అప్పగించిందన్నారు. మరోవైపు నిందితుల్ని విచారించే ందుకు కోర్టులో పిటీషన్ వేశామన్నారు. రెండు రోజులు విచారణకు ఇమ్మని కోరడం జరిగిందన్నారు. దీనికి కోర్టు అనుమతిస్తే ఈకేసులో చిక్కుముడులు వీడతాయన్నారు. నిందితులకు మద్యం ఎక్కడి నుంచి వచ్చిందన్న విషయం తేలాల్సి ఉందన్నారు. సీసాలపై ముద్రిం చినట్లు పట్టుకున్న మద్యం గోవాలో తయారైనట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.

ఆంధ్రజ్యోతి
భీమవరం
భీమవరం, ఉండి, నరసాపురం, పాలకొల్లు, ఆచంట, తణుకు, తాడేపల్లిగూడెం
8 www.andhrajyothy.com ● మంగళవారం 4 మార్చి 2025

కేసులు రాజీ చేసుకోవాలి

పాలకొల్లు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు పాలకొల్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి షేక్ జియాద్దీన్ తెలిపారు. ఆ రోజు కోర్టుహాల్లో జరిగే అదాలత్‌లో రాజీయోగ్యమైన కేసులు అన్నింటిని సామరస్యంగా కక్షిదారులు రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. సివిల్ కేసుల రాజీతో కోర్టు ఫీజులు వాపసు ఇస్తారని తెలిపారు.

పాఠశాల తరలించవద్దని ధర్నా

తణుకు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్ నెం.15ను వేరే ప్రాంతానికి తరలించే ప్రక్రియను నిలుపుదల చేయాలని, తరలింపు వల్ల విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి చివటం శివ, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఈ సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలసి ధర్నా నిర్వహించారు.

భారీ ర్యాలీ నిర్వహించండి : కలెక్టర్

భీమవరం టౌన్, మార్చి 3 (ఆంధ్రనజ్యోతి) : ఈ నెల 8వ తేదీన మహిళా దినోత్సవం నాడు భారీ ర్యాలీకి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా దినోత్సవ ర్యాలీ ఏర్పాట్లపై కలెక్టర్ తన ఛాంబర్లో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రకాశం చౌక్ నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు సుమారు వెయ్యి మంది వివిధ వర్గాల మహిళలు, విద్యార్థినులతో భారీ ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుకు సన్నాహక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఐసీడీఎస్ పీడీ బి.సుజాత రాణి, డీఆర్డీఏ పీడీ వేణుగోపాల్, డీఎంహెచ్‌వో బి. భాను నాయక్, భీమవరం మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ఐసీడీఎస్ నోడల్ అధికారి విజయలక్ష్మి, లైన్స్ ఇంటర్నేషనల్ సీహెచ్ కృష్ణంరాజు, వెస్ట్ బెర్రీ డైరెక్టర్ ఎన్.మహేష్ వర్మ, సంఘ సేవకుడు కంతేటి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయండి : ఎంపీడీవో

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో ఎం. విశ్వనాథ్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ సర్వేలను మార్చి నాటికి పూర్తిచేసి జిల్లాలో మండలాన్ని మొదటి స్థానంలో నిలపాలని కోరారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ కె వెంకట్రావు, ఈవోపీఆర్డీ ఎం. వెంకటేష్, ఏఈలు రాజాశ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్‌తో సేవా భావం



శిక్షణ ప్రారంభం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి స్కౌట్‌లో శిక్షణ పొందడం ద్వారా క్రమశిక్షణతో పాటు సేవాభావం అలవడు తుందని సమగ్ర శిక్ష ఏపీవో శ్యాం సుందర్ పేర్కొన్నారు. పెదతాడేపల్లి పీఎం శ్రీ గురుకుల పాఠశాలలో బేసిక్ కోర్సు స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్‌కు అయిదు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ శిక్షణ ఈ నెల 8వ తేదీ వరకూ కొనసాగుతుందని శ్యాం సుందర్ తెలిపారు. పశ్చిమ, ఏలూరు జిల్లాల నుంచి 50 పాఠశాలల నుంచి ఒక్కో పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. ప్రిన్సిపాల్ బి. రాజారావు మాట్లాడారు.

చానల్ ప్రక్షాళన పనులకు శ్రీకారం



పనులను ప్రారంభిస్తున్న రామభద్రరాజు

పాలకొల్లు రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు రూరల్ మండల పరిధిలోని దిగమర్రు పంటకాల్వపై రూ.15.75లక్షల వ్యయంతో చేపట్టిన చిట్టవరం, చీమలకోడు ఆయకట్టు చానల్ ప్రక్షాళన పనులను సోమవారం పాలకొల్లు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు నీటిసంఘాల చైర్మన్లు, కూటమి నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లగా దిగమర్రు పంటకాల్వపై చిట్టవరం, చీమలకోడు ఆయకట్టు ఛానల్‌లో తూడుతో నిండి సుమారు 4 వేల ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి రాగానే మంత్రి రామానాయుడు ఈ ఆయకట్టు ఛానల్ ప్రక్షాళన పనులు చేపట్టేందుకు రూ.15.75లక్షలు నిధులు మంజూరు చేశారనీ దీంతో పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. దిగమర్రు నీటిసంఘం అధ్యక్షుడు మాతా రత్నరాజు, సర్పంచ్ కౌరు భాస్కర్‌బాబు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

వీరవాసరం/భీమవరంటౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) ఆపదలో ఉన్న వారికి సహాయపడడం మానవత్వమని సంఘ సేవకుడు చెరుకువాడ రంగ సాయి అన్నారు. రాయకుదురు గుడాల వారి వీధిలో షార్ట్ సర్క్యూట్ తో తోట రాంపండు తాటాకిల్లు దగ్ధమవడంతో బాధితులకు దాతల సహకారంతో నిత్యావసర వస్తువులను అందించామని తెలిపారు.

ఎస్కేఎస్డీ విద్యార్థినులకు బహుమతులు

తణుకు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో ఈ నెల 1న నిర్వహించిన స్టేట్ లెవల్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఫెస్ట్ సావిస్కారా-2925 కార్యక్రమంలో తమ విద్యార్థినులు బహుమతులు సాధించినట్టు ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్ అన్నారు. టవర్ బిల్డింగ్‌లో వై.ప్రేమర్, పి.హేమలత ద్వితీయ, బిజినెస్ క్విజ్‌లో ఆర్.రేష్మ, పి.సౌజన్య, కె.సాయిజ్యోతి తృతీయ స్థానం సాధించినట్టు వివరించారు. విద్యార్థులను కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి అభినందించారు.

కవి బాలచందర్‌కు ప్రశంసలు

పెనుగొండ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన అంతర్జాతీయ కవి సమ్మేళనంలో పెనుగొండకు చెందిన కవి డాక్టర్ బాల చందర్ పాల్గొని కవితాలాపన చేసి ఉత్తమ కవిగా ప్రశంసలందుకున్నారు. సంస్థ ఇచ్చిన విజ్ఞాన దీపికలు వెలిగించుదాం అనే అంశానికి 'ఘనంగా చరితలో రాసేద్దాం' అనే శీర్షికతో గేయం రాసి స్వరకల్పన చేసి శ్రావ్యంగా ఆలపించడంతో ఉత్తమ కవిగా ప్రకటిస్తూ ప్రశంసాపత్రం అందించినట్లు బాలచందర్ తెలిపారు. ఎస్‌వీకేపీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, అధ్యాపకులు బాల చందర్‌ను అభినందించారు.



ఆచంటేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

ఆచంట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఆచంటేశ్వరుని హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించగా రూ. 4 లక్షల 88 వేల 159 ఆదాయం లభించినట్టు, అలాగే ప్రత్యేక దర్శనం, అభిషేకాల టిక్కెట్లు ద్వారా రూ. 3 లక్షల 11 వేల 351 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ తెలిపారు. దేవస్థానం ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు సమక్షంలో లెక్కింపు జరగగా కమిటీ చైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, ఆలయ అధికారులు గుబ్బల రామ పెద్దింట్లరావు, భక్తులు పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపును భీమవరం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. రూ. 3,61,401లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో రామచంద్ర కుమార్ తెలిపారు. ఈవో బి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రం అభివృద్ధికి సహకరించండి

భీమవరం టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పంచారామ క్షేత్రమైన సోమేశ్వరాలయ అభివృద్ధికి సహకరించాలని శ్రీవేదవిజ్ఞాన పరిషత్ సభ్యులు డీవీ బాల సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి ఎమ్మెల్యే అంజిబాబును కోరారు. 24 ఏళ్లుగా కనీస వసతులను కల్పించాలని దేవదాయ, ధర్మదాయ శాఖకు వినతులు అందిస్తూనే ఉన్నామని, సీజీఎఫ్ సమావేశంలో కూడా ప్రతిపాదనలు చేశామన్నారు. అన్నదాన సత్ర భవనం, పిలిగ్రిం సెంటర్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలనీ ఎమ్మెల్యేను కోరారు.



రైతులే నడుం బిగించి..

స్వచ్ఛందంగా పంట కాల్వ ప్రక్షాళన

నరసాపురం రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేస్తుందిలే అని చూడలేదు.. రైతులే నడుం బిగించి పంటకాల్వల ప్రక్షాళన చేపట్టారు. మండలంలోని వైఎస్‌పాలెం గ్రామంలోని రామన్నపాలెం- లక్ష్మణేశ్వరం పంట బోదె పూడిక, గుర్రపుడెక్కతో నిండిపోయింది. ప్రతి ఏటా దాళ్వా సీజన్‌లో రైతులు సాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. సమస్యను గుర్తించిన రైతులు చేయి చేయి కలిపి 4 కిలోమీటర్ల మేర పంటబోదెను శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని తొలగించి శివారు ప్రాంత భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టారు. ఇటు కొత్తగా ఎన్నికైన నీటి సంఘాల అధ్యక్షులు తమవంతు సాయంగా కాల్వలను శుభ్రం చేసి రైతులకు అండగా నిలుస్తున్నారు. మండలంలోని శేషావతరం, పసలదీవి ఛానల్స్‌లో ఎక్స్‌కవేటర్ల సాయంతో పూడిక పనులు చేపడుతున్నారు.

వైఎస్‌పాలెం పంట బోదెలో గుర్రపు డెక్క తీస్తున్న రైతులు

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..



టెన్త్ ప్రి ఫైనల్‌లో వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్

తణుకు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థుల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రి ఫైనల్ పరీక్షల్లో సింగిల్ సబ్జెక్టులో ఫెయిల్ అయిన విద్యార్థులపై యంత్రాంగం ఫోకస్ పెట్టింది. విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో ఫెయిల్ అవుతున్నారు. వారికి ఎలాంటి శిక్షణ ఇస్తే పరీక్షల్లో గట్టెక్కుతారనే అంశాలను క్షేత్ర స్థాయిలో తెలుసుకునేందుకు ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించారు. ఆయా సబ్జెక్టుల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి సత్ఫలితాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డివిజన్‌లో 111 ప్రభుత్వ పాఠశాలల నుంచి రెగ్యులర్ విద్యార్థులు 10 వేల 613 మంది పది పరీక్షలు రాయనున్నారు. ఇటీవల ప్రి ఫైనల్ పరీక్షల్లో సుమారు 900 మంది సింగిల్ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారని అధికారులు చెబుతున్నారు. చాలా మంది విద్యార్థులు తెలుగు, సైన్సు సబ్జెక్టుల్లో ఫెయిలైనట్టు సమీక్షా సమావేశాల్లో ప్రధానోపాధ్యాయులు నివేదిక అందజేశారు. దీంతో ఆయా సబ్జెక్టుల్లోని ఉపాధ్యాయులతో ప్రతి రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రతి విద్యార్థి పాసయ్యేలా..



ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం. ఇందుకోసం ఇప్పటికే సిలబస్ పూర్తయిన తర్వాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఇపుడు సింగిల్ సబ్జెక్టులో ప్రి ఫైనల్‌లో ఫెయిలైన విద్యార్థులపై దృష్టి పెట్టాం. వారి ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

-డి.మురళీ సత్యనారాయణ, డీవైఈవో



ఎంఎస్‌ఎంఈ సర్వేను పరిశీలిస్తున్న జేసీ

సర్వేకు వ్యాపారులు సహకరించాలి

భీమవరంటౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈ సర్వే త్వరగా పూర్తి చేసేందుకు చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారులు అధికారులకు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన భీమవరంలో పలు దుకాణాలను సంబంధిత శాఖల అధికారులతో కలిసి సందర్శించి సర్వే నమోదుపై ఆరా తీశారు. జిల్లాలోని చిన్న, మధ్య తరహా వ్యాపారులు తమ పాన్ కార్డు, ఆధార్ కార్డు, జీఎస్టీ, పవర్ బిల్లుతో సర్వే నమోదుకు వచ్చిన గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి సహకరించాలని కోరారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.





పెనుమంట్ర, ఆకివీడులో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పెనుమంట్ర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని డిప్యూటీ తహసీల్దార్ కె. ఏలియమ్మ అన్నారు. మహిళా దినోత్సవంలో భాగంగా సోమవారం పెనుమంట్రలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళా సాధికారత వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో బేటీ బచావో, బేటీ పడావో, స్త్రీమూర్తులను గౌరవిద్దాం, బాలికలను కాపాడుదాం.. వారిని చదివిద్దాం అంటూ నినాదాలు చేశారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కృష్ణకుమారి కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టి. పోచమ్మ, ఎస్ వెంకటలక్ష్మి, పి.వరలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకోవాలి

ఆకివీడు: ఆడపిల్లలను రక్షించుకోవడం అందరి ధర్మమని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వి.వాణి విజయ రత్నం, ఎస్‌ఐ హనుమంతు నాగరాజు అన్నారు. ఉమెన్స్ డే వార్షికోత్సవంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. మగవారితో సమానంగా ఆడపిల్లలను పెంచాలన్నారు. ఆడపిల్లలు మహాలక్ష్మితో సమానమన్నారు. సూపర్‌వైజర్ రత్నకుమారి, అంగన్‌వాడీలు, మహిళా పోలీసులు ఉన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలిద్దాం..

మొగల్తూరు: బాల్య వివాహాలు నిర్మూలన ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సీడీపీవో బి.ఊర్మిళ సూచించారు. మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం మొగల్తూరులో అంగన్‌వాడీ సిబ్బంది కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, పురోహితుడు సుదర్శనం రామకుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. మానవహారం నిర్మించారు.



తొలిరోజు పరీక్ష ప్రశాంతం

ఆకివీడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కార్తికేయ జూనియర్ కళాశాల,దుంపగడప ఏ కేపీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్లలో తెలుగు, సంస్కృతం, వృత్తివిద్యా పరీక్షలకు సంబంధించి 644 మందికి 22 మంది గైర్హాజరవ్వగా 622 మంది పరీక్షలు రాసినట్టు అధికారులు తెలిపారు.

ఆచంట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 58 మంది విద్యార్థులకు గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు కాగా 55 మంది పరీక్షలకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. శ్రీదేవి తెలిపారు.

మానవ రహిత వాహనాలపై విస్తృత పరిశోధనలు

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మానవ రహిత వాహనాలపై ప్రపంచ వ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని ఐఐటీ హైదరాబాద్ టీహాన్ డైరెక్టర్ డాక్టర్ పి.రాజ్యలక్ష్మి తెలిపారు. ఏపీ నిట్‌లో ఆన్మెన్డ్ ఏరియల్ వెహికల్స్ ఫర్ వైర్‌లెస్ కమ్యునికేషన్ అండ్ రిమోట్ సెన్సింగ్ అనే అంశం పై ఐదు రోజుల పాటు నిర్వహించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ భానావతు నర్సింహారావు అధ్యక్షత వహించగా డాక్టర్ రాజ్యలక్ష్మి ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ మానవ రహిత వాహనాల్లో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఐఐటీ హైదరాబాద్ ఆచార్యులు డాక్టర్ జీవీవీ శర్మ మాట్లాడుతూ రిమోట్ కంట్రోల్ సహాయంతో పనిచేసే సమర్థవంతమైన డ్రోన్లు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్ శంకర్‌రెడ్డి, డీన్ రీసెర్చ్‌అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ రవికిరణ్‌శాస్త్రి మాట్లాడుతూ నిఘా నేత్రాలుగా డ్రోన్లు అద్భుతమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. మనుషులు వెళ్ళలేని ప్రాంతాలకు సైతం డ్రోన్లు సులువుగా వెళ్ళగులుతున్నాయన్నారు.



కలెక్టరేట్ వద్ద మునిసిపల్ కార్మికుల నిరసన

మునిసిపల్ ఉద్యోగుల ధర్నా

భీమవరం అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్, ఆప్కాస్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించి, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ఏఐటీయుసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెక్కంటి సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. సోమ సుందర్ జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా జిల్లాలోని ఐదు మున్సిపల్ ఏరియాల్లోని వర్కర్స్‌తో ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు అందించారు. మున్సిపల్ ఉద్యోగ కార్మికుల వేతనాలు చెల్లింపు, పనులు అప్పగింత నిర్వహణ, సాంఘిక భద్రత, మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యత ఉండాలన్నారు. వీటిని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పరాద న్నారు. ఔట్ సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ధర్మరాజు

వైభవంగా తిరునాళ్ళు

గణపవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మొయ్యేరు గ్రామదేవత పుంతల ముసలమ్మ తిరునాళ్ళు వైభవంగా జరుగుతున్నాయి. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదివారం రాత్రి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మంగళవారం ముగింపు ఉత్సవాల్లో భాగంగా భారీ అన్నసమారాధన జరుగనుంది. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు, జనసేన నాయకులు వంగా రఘు, కొల్లి ప్రసాద్, టీడీపీ నాయకులు కానుమిల్లి చంటి, ఇంటూరి చంద్రమోహన రావు, ఉత్సవ కమిటీ సభ్యుడు మేకా శ్రీనివాసరావు, సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను ఈవో శోభనాద్రి సత్కరించారు.

ఆకివీడు రూరల్: చినకాపవరంలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి

ఆధ్యాత్మికం

ఉత్సవాల్లో భాగంగా సోమవారం అఖండ అన్న సమారాధన జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించు కుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిరోజు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశామని నిర్వాహకులు చైర్మన్ నందమూరి సత్యవతి తెలిపారు. అల్లాడి బాలాజీ, బాబ్జి సత్యనారాయణ, శ్రీను, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: స్థానిక 6వ వార్డు మఠం వీధిలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీవీరభద్ర స్వామి వారి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వీరభద్రుని కల్యాణోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా అన్నసమారాధన జరిగింది.

ఉండి: పునఃప్రతిష్ఠించిన కోదండ రామాలయంలో సోమవారం మహిళలు పెద్దసంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు.

వెండి మకర తోరణానికి సహకరించాలి..

పాలకొల్లు టౌన్: మఠం వీధిలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామివారి ఆలయంలో స్వామివారికి వెండి మకర తోరణం చేయించ సంకల్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సుమారు 5 కిలోల వెండి అవసరం అవుతుందని, భక్తులు సహకరించాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.



సుందరరావును అభినందిస్తున్న సంఘ సభ్యులు

డెలిగేట్‌గా సుందరరావు ఎన్నిక

కాళ్ళ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జక్కరం పారిస్ హెడ్ క్వార్టర్ సెయింట్ జాన్ లూథరన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోమవారం డెలిగేట్ ఎలక్షన్ నిర్వహించారు. జక్కరం పెదపేట లూదరన్ చర్చికి చెందిన చిలకపాటి సుందరరావు డెలిగేట్‌గా, బొండాడ చిన్నపేట సంఘానికి చెందిన దొండపాటి రవిచంద్రన్ ఆల్టర్నేటివ్ డెలిగేట్‌గా ఎన్నికయ్యారు. పారిస్ పాస్టర్ రెవ. జి.డి. కరుణాకర్ ఆధ్వర్యంలో ఎలక్షన్ అబ్జర్వర్‌గా రెవ. ప్రకాష్ వ్యవహరించిన ఈ ఎన్నికల్లో జక్కరం పారిస్‌లోని అన్ని సంఘాల పీసీసీలు తమ ఓటు హక్కును వినియోగించుకుని చిలకపాటి సుందరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించారు. కాగా సుందరరావు జక్కరం పారిస్ డెలిగేట్‌గా ఎన్నికవ్వడం వరుసగా ఇది మూడోసారి.

ఇంటర్వ్యూ..

30 మంది పట్టాదారులు అనర్హులు



వైకేపీ అప్పారావు, తహసీల్దార్, గణపవరం

- **వైసీపీ హయాంలో ఇచ్చిన ఇళ్ళపై సర్వే నత్తనడకన సాగుతోందన్న ఆరోపణలున్నాయి?**
జవాబు: సర్వే జోరుగా సాగుతోంది. ప్రస్తుతం 30 మంది పట్టాదారులను అనర్హులుగా గుర్తించాం.
- **అనర్హులపై తీసుకునే చర్యలేమిటి?**
జవాబు: నోటీసులు జారీ చేస్తాం. విచారణ చేసి ఫైనల్ చేస్తాం.
- **గ్రామ రెవెన్యూ సభల ద్వారా ఎన్ని అర్జీలు వచ్చాయి?**
జవాబు: 194 దరఖాస్తులు వచ్చాయి. 180 పరిష్కరించాం. మిగతా 14 రికార్డుల్లో అవకతవకలు ఉన్నాయి.
- **ఎన్ని గ్రామాల్లో భూముల రీసర్వే జరిగింది?**
జవాబు: ముప్పర్తిపాడులో పూర్తి చేశాం. మొయ్యేరు, డీకే వల్లిలో ప్రారంబించనున్నాం.
- **ఈ నెల కందిపప్పు పంపిణీ జరగలేదంటున్నారు?**
జవాబు: సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

(ఆంధ్రజ్యోతి-గణపవరం)

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గొల్లవానితిప్ప విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించటం, లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈ నెల 4న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొత్త పూసలమర్రు, దొంగపిండి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

కాళ్ళ: కాళ్ళ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో పనులు నిమిత్తం మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దొడ్డనపూడి, సీసలి, కోమటిగుంట, చినపుల్లేరు, పెదపుల్లేరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ భువన

ఆకివీడు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్‌గా డాక్టర్ భువన నియమితులయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ సూపరింటెండెంట్‌గా డాక్టర్ అచ్యుత్ గణేష్ విధులు నిర్వహించారు. ఏలూరు డీసీహెచ్‌ఎస్ ఉత్తర్వులు మేర డాక్టర్ గణేష్ డాక్టర్ భువనకు నియామక పత్రం అందజేశారు. వైద్య సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియచేశారు.

బీసీలకు అండగా నిలిచిన టీడీపీ : కోరాడ



నరసాపురం టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ళ వైసీపీ పాలనలో బీసీలకు ఒరగబెట్టిందేమీ లేదని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి కోరాడ పాపారావు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజికపరంగా గుర్తింపు నిచ్చింది టీడీపీ పార్టీనేన్నారు. బీసీలకు అనేక రాయి తీలు ఇచ్చి జీవనస్థితిగతుల్ని మార్చింద న్నారు. ఇందుకు నిదర్శనం బడ్జెట్‌లో నిధులు కేటాయించడమేనన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

పెంటపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రైతులంతా తమ పశువులకు తప్పనిసరిగా గాలి కుంటువ్యాధి నివారణా టీకాలు వేయించాలని సర్పంచ్ కోలా శేషవేణి అన్నారు. సోమవారం దర్శిపర్రులో పశువుల కు గాలికుంటు నివారణ టీకాల శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. మొత్తం 100 పశువులకు టీకాలు వేసినట్లు వెటర్నరీ వైద్యుడు డాక్టర్ మహేష్ తెలిపారు. నీటి సంఘం అధ్యక్షుడు కోలా మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తణుకు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీ నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల బీమారావు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. త్వరితగతిన ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 15న భీమవరం జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఆకివీడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వడ్రంగి పనివారల సంఘం జిల్లా నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అరసవల్లి రామచంద్రరావు, అధ్యక్షుడిగా చిట్టిమోజు బోగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చెప్పాడ చంద్రశేఖరరావు, కోశాధికారిగా లక్కోజు సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు.